క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



నాగలదిన్నెలో చిన్నమ్మ దేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నందవరం : గ్రామ దేవర ఉత్సవలో భాగంగా మొదటి రోజు మంగళవారం గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో జరిగే 43 ఏళ్ల తర్వాత నిర్వహించే గ్రామ దేవరలో భాగంగా గ్రామ దేవతలు పెద్దమ్మ దేవి, చిన్నమ్మ దేవి, మారెమ్మవ్వ, సుంకలమ్మకు గ్రామస్తులు, భక్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామ పొలి మేర చుట్టూ పాలు పొత్తు కార్యక్రమం చేపట్టారు. గ్రామపెద్దలు కుష్మాండ బలి, కుంభోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెలుగు లక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడాలి



డాక్టర్ మనోజ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

కోసిగి: లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, వీరేష్, ఆశావర్కర్లు వెంకటమ్మ, సుజాత, లక్ష్మిలు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు యూనియన్ నాయకులు డాక్టర్ మనోజ్ కుమార్‌కు సమ్మె నోటీసును అందజేశారు. వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడాలని కోరుతూ ఈనెల 20న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి దుల్లయ్య

కోసిగి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జనరల్ నాలెడ్జ్, పుస్తక పఠనం మెరుగు పరుచుకోవాలని గ్రంథాలయ అధికారి దుల్లయ్య అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయానికి వచ్చి పాఠ్య పుస్తకాలు, నవలు, కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదువుకుని పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్ బోర్డు, చదరంగం, తదితర పోటీలు నిర్వహించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ ఆడుతూ ఉత్తేజపరుస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని సెంట్రల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆదోని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును సీఐ చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదోని ఫిలిప్స్ కబడ్డీ టీం సీనియర్, జూనియర్ ప్లేయర్స్, కోచ్ అమర్ ప్రకాష్, దుబ్బా, నాగరాజు, ఎల్లప్ప, పరిష, చిన్న, సుమహారతి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి



లేఅవుట్ మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్, టీపీఓ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సాయి గణేష్ కాలనీలో సర్వే నంబర్ 453/ఏ2, 453/బీ1ఏలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుటకు(ఎల్ఆర్ఎస్) 2020, రూల్ 8(జీజీ) ప్రకారం అభ్యంతరాలుంటే 15 రోజుల్లోగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయా లేఅవుట్ మ్యాప్‌లను టీపీఓ రాజేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంపిటెంట్ అథారిటీ ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి ప్రజలు రాత పూర్వకంగా లేదా మెయిల్ ద్వారా అభ్యంతరాలు, సూచనలివ్వవచ్చన్నారు. సంబంధిత లేఅవుట్ మ్యాప్‌ను dtcp. ap@cdma.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

మండుతున్న ఎండలు..

కనిపించని చలివేంద్రాలు

- రోజు రోజుకూ తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు
- చలివేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం
- దాహంతో అల్లాడుతున్న ప్రజలు



గోనెగండ్ల బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఏకైక చలివేంద్రం

గోనెగండ్ల: రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. వడగాల్పులు బలంగా వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే నమోదవుతున్నాయి. దీంతో దాహం విపరీతంగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో మండలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పంచాయతీ సిబ్బంది కనీస విధి. కానీ పాలకులు, అధికారులు పాలనపై పూర్తిగా దృష్టిసారించడం మానేశారు. ఫలితంగా మండలంలో ఎక్కడా చలివేంద్రాలు కానరావడం లేదు. ఎండల తీవ్రత దృష్ట్యా గతంలో గ్రామాల్లో దాతలు మార్చి నెల నుంచే చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. అయితే ఈ ఏడాది వారుకూడా ముందుకురాకపోవడం గమనార్హం.

మండలంలో ఒక్కటి మాత్రమే..

మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఏడాది ఏ పంచాయతీ కేంద్రంలోనూ చలివేంద్రాల ఏర్పాటుపై ఆదేశాలు జారీ కాలేదు. మండలంలో ఒక్క గోనెగండ్ల బస్టాండ్ ఆవరణలో ఒకటి మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రజలకు అవసరాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గ్రామ పంచాయతీల్లో ప్రజా అవసర నిమిత్తం ప్రజలు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉంటారు. అలాగే నిత్యం మండల కేంద్రం గోనెగండ్లకు కూడా వస్తుంటారు. కొన్ని గ్రామాల్లో ఊరి నడిబొడ్డున పంచాయతీ కార్యాలయాలు ఉండగా మరికొన్ని చోట్ల గ్రామానికి దూరంగా భవనాలు ఉన్నాయి. అలాంటి సమయంలో కార్యాలయాలకు వచ్చిన ప్రజలు, వృద్ధులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. అలాగే వివిధ పనుల నిమిత్తం ఊళ్లకు వెళ్లేవారు, పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు అందుబాటులో లేని కారణంగా వృద్ధులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. మండల కేంద్రాల్లో సైతం చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీల్లో నిధులు ఉన్నప్పటికీ ప్రజల దాహార్తి తీర్చడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శిస్తున్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



అధికారులు చొరవ తీసుకొని ప్రధాన కూడళ్లలోనైనా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల దహార్తి తీర్చాలి.

– గోవింద్, పిల్లిగుండ్ల గ్రామం

ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించాలి



మండలంలో బస్సు సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. వీరంతా ప్రధాన రహదారికి చేరుకొని బస్సులు, ఆటోల ద్వారా తమ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్తుంటారు. అధికారులు గుర్తించి ప్రధాన రహదారుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు పరిష్కరించాలి.

– మురళి నాయుడు, గోనెగండ్ల

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలంలో మంగళవారం బోంపల్లి నరసింహుడు(65) ఆకస్మికంగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే స్ఫూర్తితో కాంట్రాక్టర్ బసవరాజు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న ఈరన్న, అప్‌లై మొద్దన్న, వార్డుమెంబర్ గోవిందు, తలారి రామదాసు, కోసిగి రామిరెడ్డి, నాగరాజు ఉన్నారు.

సమయపాలన పాటించేలా చూడాలి

ఆదోని రూరల్: సచివాలయ అధికారులు సమయపాలన పాటించేలా చూడాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, నాయకులు పరమేష్ మున్సిపల్ కమిషనర్ కృష్ణను కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణంలోని 35వ వార్డు అమరావతినగర్ సచివాలయ అధికారులు సమయపాలన పాటించడం లేదన్నారు. సచివాలయంలో నెలల నుంచి కంప్యూటర్ కూడా పని చేయడం లేదన్నారు.

ఖాదర్‌లింగస్వామి ఉరుసుకు ఆహ్వానం



ఉరుసుకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగస్వామి 321వ ఉరుసుకు రావాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు. ధర్మకర్త మాట్లాడుతూ ఈనెల 9నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. 9న శుక్రవారం స్వామి సమాధిని సుగంధ పానియాలతో (గుసుల్) శుభ్రచేయడం జరుగుతుందని, 10న శనివారం గంధం, 11న ఆదివారం ఉరుసు ఉత్సవం ఉంటాయని తెలిపారు. 12న (సఫ్‌రాలూట్‌నా) స్వామి ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉంటుందని, అలాగే 13వ తేదీ మంగళవారం రోజు జియారత్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఖాదర్ లింగస్వామి శిష్యరిక బృందం పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కుకు భూమిపూజ



టెక్స్‌టైల్ పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రులు సవిత, టీజీ భరత్, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత, రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌తో పాటు రాష్ట్ర జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ చేనేతలకు స్వర్ణయుగం తేవటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. టెక్స్‌టైల్‌పార్కుతో పాటు ఎమ్మిగనూరులో స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

శిలాఫలకంపై మంత్రి మేరు మాయం

టెక్స్‌టైల్ పార్క్ భూమి పూజ శిలాఫలకంపై చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేరు లేకపోవడం పట్ల ఆమె అసహనానికి లోనయ్యారు. దీంతో ఆమె ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో సంబంధిత శాఖ కమిషనర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈసారైనా నిర్మాస్తారో, లేదో?

2004 సంవత్సరం ఎన్నికలకు ముందు నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి ఇదే ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే నిధుల కేటాయింపు లేక నిర్మాణానికి నోచుకోలేకపోయింది. ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ రెండోసారి టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఆయన కుమారుడు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు భూమి పూజను అట్టహసంగా చేపట్టడం గమనార్హం. ఈసారైనా టెక్స్‌టైల్ పార్క్‌ను పూర్తి చేస్తారో, లేదోననే చర్చ స్థానికుల్లో జరుగుతోంది.

ఎంఐజీ లేఅవుట్‌ను అభివృద్ధి చేయండి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని బనవాసి వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత హయాంలో ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజల కోసం కేటాయించిన ఇళ్ల స్థలాల ఎంఐజీ లేఅవుట్ (ఎన్టీఆర్ టౌన్‌షిప్)ను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులు మాదన్న, భాగ్యరాజు, మద్దిరాజు,ప్రశాంత్ భూపాల్, అశోక్ కుమార్, మారెప్ప కోరారు. ఈమేరకు మంగళవారం టెక్స్‌టైల్ పార్క్ భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తాము తీసుకున్న స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయించుకున్నామని, తమ స్థలాలున్న లేఅవుట్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

రెగ్యులర్ సెక్రటరీని నియమించండి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైడబ్ల్యూసీఎస్‌కు రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని వైడబ్ల్యూసీఎస్ చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు పంపన్న, రామచంద్ర, నాగరాజు, గుర్నాథ్, కృష్ణ ,బసన్న తదితరులు కోరారు. ఈమేరకు మంగళవారం టెక్స్‌టైల్ పార్క్ భూమి పూజ కోసం వచ్చిన చేనేత జౌళిశాఖ మంత్రి సబిత, కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇన్‌చార్జ్ సెక్రటరీగా వున్న ఏడీ నాగరాజారావు ఇటీవల నిర్వహించిన వైడబ్ల్యూసీఎస్ సర్వసభ్య సమావేశ అజెండా, ఆడిట్ రిపోర్ట్ 15రోజుల ముందుగా సభ్యులకు ఇవ్వాల్సివున్నప్పటికీ.. ఆ నిబంధన పాటించకుండా సమావేశం నిర్వహించి అజెండాలోని అంశాలను ఆమోదింపజేసుకున్నారని ఆరోపించారు. అజెండా కాపీని కూడా తెలుగులో కాకుండా ఇంగ్లీష్‌లో ముద్రించడంతో నిరక్షరాస్యులైన సభ్యులకు ఏ విధంగా అర్థమవుతుందని ప్రశ్నించారు. రెగ్యులర్ సెక్రటరీ అప్పాజి డిప్యూటేషన్‌ను రద్దు చేసి స్థానికంగా నియమించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కొరారు.

విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఆదోని సెంట్రల్: ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆదోని డివిజన్ ప్రధాన కార్యదర్శి యు.దస్తగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదోని డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల దోపిడీ, పుస్తకాల వ్యాపారం అరికట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, నాని, తరుణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 77ను రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: జీవో నంబర్ 77ను రద్దు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థుల పాలిట శాపంగా తయారయ్యిందన్నారు. జీఓను రద్దు చేస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం నేటికీ రద్దు చేయడం లేదన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి హేమ

ఎమ్మిగనూరుటౌన్: కార్మిక చట్టాలపై అవగాహన అవసరమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.హేమ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని కోసిగి రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ఇటుకల బట్టీ ఆవరణలో అందులో పని చేసే కార్మికులకు కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం, వసతులు కల్పించాలన్నారు. కార్మికులకు ఏవైన సమస్యలుంటే లేబర్ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా మండల న్యాయ సేవాధికార కమిటీకి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో లేబర్ శాఖ అధికారి కేశన్న, స్థానిక కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా, కోశాధికారి మురళీకృష్ణ, న్యాయవాదులు రామకృష్ణ, లింగమూర్తి, పట్టణ ఏఎస్ఐ కిష్టప్పనాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా అన్నిశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీకి సంబంధించిన వాటర్ లైన్‌మెన్‌లు, ఫిట్టర్‌లు, టాప్ ఇన్‌స్పెక్టర్, డీఈ శ్రీరామ్‌మూర్తి, ఏఈ జనార్దన్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవకుండా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజూ తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ ఏదైనా సమస్య తలెత్తినప్పుడు వెంటనే స్పందించాలన్నారు. వైస్ చైర్మన్ నరసింహులు మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించడమే మున్సిపాలిటీ ప్రాధాన్యత అని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్, బాలాజీ, ముంబతి స్వామి, భాస్కర్, వసీం, ఉస్మాన్, అశోక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఈఎల్ఎస్‌ను మంజూరు చేయాలి

ఆదోని సెంట్రల్: వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్‌ను మంజూరు చేయాలని బీటీఏ కర్నూలు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రామకృష్ణ డీఈఓ శామ్యూల్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోనికి వచ్చిన డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించబడుతోందన్నారు. ఏప్రిల్ 14 నుంచి జూన్ 11 వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే పదో తరగతి ఫలితాలు రావడంతో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమీడియల్ క్లాసులు నిర్వహించాలని ఆదేశాలిచ్చారని చెప్పారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్‌ను మంజూరు చేయాలన్నారు.

ఆర్‌టీసీ బస్సులో నుంచి పొగలు

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల బస్టాండ్‌లో కర్నూలు–2 డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సులోని రేడియేటర్ వెడెక్కడంతో పొగలు వచ్చాయి. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా బస్సును నిలిపివేసి ప్రమాదం నుంచి తప్పించాడు. మంగళవారం మధ్యాహ్నం కర్నూలు డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు కర్నూలు నుంచి ఆదోనికు బయలు దేరింది. గోనెగండ్ల బస్టాండ్‌కు చేరుకోగానే ఇంజిన్ బానెట్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని వెంటనే గుర్తించిన డ్రైవర్ బస్సు ఇంజిన్‌ను వెంటనే ఆపివేశాడు. ప్రయాణికులను కిందకు దించారు. కండెక్టర్ వారిని వేరే బస్సుకు ఎక్కించి పంపించారు. పక్కనే ఉన్న హోటల్ నుంచి బకెట్‌లో నీటిని తీసుకువచ్చి రేడియేటర్‌ను చల్లర్చేందుకు ప్రయత్నించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఆస్పరి: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య కూలీలకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని అట్టికల్లు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేసి కూలీల మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని చెప్పారు. ఎక్కడైనా ఒకరి పేరు మీద మరొకరు పనులకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఓ రామకృష్ణ వెంట ఉన్నారు.

సెలవులు.. తీసుకోవాలి జాగ్రత్తలు!



గోనెగండ్ల సమీపంలో నీళ్ల ట్యాంక్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

- పాఠశాలలకు వేసవి సెలవులు
- పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- చిన్నారులపై పర్యవేక్షణ తప్పనిసరి

గోనెగండ్ల: వేసవి కాలం కారణంగా ఈనెల 24నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. ఇంటి పట్టునే ఉండి విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సెలవులు రావడంతో బయటకెళ్లే పిల్లలే అధికం. గోనెగండ్ల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ మొత్తం 64 పాఠశాలలున్నాయి. 12వేల మంది విద్యార్థులున్నారు. సమయం దొరికితే చాలు దాదాపు చిన్నారులంతా సమీప పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ స్థలాల్లో, గ్రామ శివారుల్లో వేసిన లేఅవుట్‌లలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ ఆడేందుకు వెళ్తుంటారు. ఎండలో క్రికెట్ అడడం వల్ల దాహంతో సమీపంలో అందుబాటులో ఉన్న నీటిని తాగేస్తుంటారు. రక్షిత మంచినీరు తాగకపోతే వ్యాధుల బారిన పడతారు. చిన్నారుల కదలికపై పర్యవేక్షణ లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముంది.

ఆటలపై ఆసక్తి

విద్యార్థులు మైదానాల్లో ఆటలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఆ సరదా కాస్త వారు నెగ్గే ఆటల్లోనూ, స్కోర్ విషయాల్లో చిన్నపాటి ఘర్షణలు జరిగిన సందర్భాలు మండలంలో ఉన్నాయి. దీనికి తోడు ఎండలు ముదురుతున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. పొద్దస్తమాను ఎండలో ఆటలతో సమయం లేకుండా గడిపితే సాయంత్రమయ్యేసరికి వడదెబ్బకు సొమ్మసిల్లి పోయే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు ఎండలోకి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈతతో ప్రమాదం

చెరువుల్లో, ఎల్లెల్సీ కాలువలు, బావుల్లో ఈత కొడుతూ ఆడుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతుంటారు. మండలంలో ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో గుంతలు లోతుగా తవ్వేస్తున్నారు. దీనిపై వారికి అంచనా ఉండదు. ఈ గోతుల్లో ప్రమాదానికి నిలయాలు, చెరువు గట్టుపై నుంచి నీటిలోకి దూకడం, ఒకరిని చూసి మరొకరు ఈత పోటీలకు ప్రయత్నిస్తే నీటమునిగే ప్రమాదముంది. గతంలో చాలా చోట్ల చెరువు, నీటి కుంటల్లో ఈత సరదాల్లో చిన్నారులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చూశాం. గతంలో గాజులదిన్నె ప్రాజెక్టు, గోనెగండ్లలోని ఎల్లెల్సీ కాలువ, పెద్దనేలటూర్ తదితర గ్రామ శివారులోని బావుల్లోకి చిన్నారులు సరదాగా ఈతకు వెళ్లి మునిగి చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదాలను గుర్తించి చిన్నారులను బావులు, చెరువుల వద్దకు వెళ్లనివ్వకుండా నియంత్రించాలి.

జాగ్రత్తలు ఇలా..

తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఖాళీ సమయంలో నిత్యం చదివే పాఠ్యాంశాల పుస్తకాలతో పాటు విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివేలా ప్రోత్సహించాలి. ఈత సరదా, షికారు, ఎండల్లో ఆటలను నిలువరించి వారి దృష్టిని వేరే వ్యాపకాలపై మళ్లించాలి. ఇంటి వద్ద నీడపట్టునే ఉండి చదరంగం, క్యారమ్ తదితర ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి.

పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



వేసవి కాలం కావడంతో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. జూన్ 12వ తేదీ పాఠశాలలు పునప్రారంభం అవుతాయి. కాబట్టి ఇళ్ల వద్ద పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎండల్లో తిరగకుండా ఇంటి వద్దే చదువుకునేలా చూడాలి. ఈత రాని చిన్నారులను చెరువులు, బావులు వద్దకు వెళ్లకుండా చూడాలి.

– నీలకంఠ, ఎంఈఓ–2, గోనెగండ్ల

జాతివైరం మరిచి.. ఆకలి తీర్చి!



కౌతాళం: రోడ్లపై పంది పిల్లలు కనిపిస్తే తరిమే కుక్కలను చూసే ఉంటాం కానీ మండల కేంద్రమైన కౌతాళంలో వింత సంఘటన చోటు చేసుకుంది. కౌతాళం నుంచి కామవరం వెళ్లే రోడ్డులో మంగళవారం ఓ శునకం జాతి వైరం మరచి పందికి పాలిచ్చింది. మనిషికి మనిషి సాయం చేయని నేటి సమాజంలో కుక్క తన జాతిని మరిచి అన్ని జంతువులు ఒకటే అనే రీతిలో పందికి పాలివ్వడం జరిగింది.

పందికి పాలు ఇస్తున్న శునకం

తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్

ఆదోని టౌన్: పట్టణంలోని 37వ వార్డులో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిన వెంటనే కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ తక్షణమే చర్యలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున నీటి సరఫరా పూర్తిగా నిలిచి పోయిన పరిస్థితిని గమనించి ఆయన వెంటనే మున్సిపాలిటీ లైన్‌మెన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, డీఈ శ్రీరామ్మూర్తి, ఏఈ జనార్దన్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. స్పందించిన వారు సంబంధిత సిబ్బంది, లైన్‌మెన్, వర్కర్లను ఘటనా స్థలానికి పంపి వాటర్ వాల్ సెట్టర్‌కు మరమ్మతు చేయించారు. తక్కువ సమయంలోనే నీటి సరఫరా పునరుద్ధరించడంతో ప్రజలు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.